# 13. గోదావరి ఎక్స్‌ప్రెస్‌కి బుద్ధొచ్చింది

"స్టేషన్‌కి మన ఆఫీసు జీపు వస్తుందో రాదో! అంచేత నేను రామ్మూర్తిపంతులు పేట గేటు దగ్గిర దిగిపోతాను" అని చెప్పేను మా ఆఫీసర్‌గారితో

"జీపు వొస్తుంది. మీరు స్టేషన్‌లోనే దిగుతారు. జీపులో మీరు కంచరపాలెం చేరి స్నానం గట్రా చేసి స్కూటర్‌మీద ఆఫీసుకి వెళ్లండి, నేను అదే జీపులో మువ్వలవానిపాలెం వెళ్లి మా ఇంట్లో నా సామాను కూడా దింపేసుకుని స్నానం, భోజనం చేసి నింపాదిగా పదకొండు దాటేక ఆఫీసుకొస్తాను. మనం హైద్రాబాద్ నుంచి తెచ్చిన కాగితాలు మీ దగ్గిరే ఉంచుకోండి. మీరు నాకన్నా ముందుగా ఆఫీసు చేరుతారు గనక ఎం.డి.గారు నేనొచ్చేలోపుగా కాగితాలు చూస్తానని కబురుపెడితే చూపించెయ్యండి." అన్నారు మా ఆఫీసర్‌గారు.

"కాగితాలు నా దగ్గిరే ఉంటాయి. నేను మీకన్నా ముందుగా ఆఫీసుకి చేరడమే మన లక్ష్యం. అటువంటప్పుడు నేను కంచరపాలెం గేటు దగ్గిర దిగిపోతేనే మరింత టైమ్ కలిసొస్తుంది. ఒకవేళ జీపు రాకపోయినా నేను మీకంటే ముందుగా ఆఫీసుకి చేరతాను. జీపు వొచ్చిందే అనుకోండి, మీరు నిశ్చింతగా మీ ఇంటికి వెళ్లిపోవచ్చు. పదకొండు గంటలకి కాకపోతే పన్నెండింటికి రండి."

"రైలు కంచరపాలెం గేటు దగ్గర ఆగకపోతేనో?" అన్నారాయన.

"అలా ఎప్పటికీ జరగదు. ఈ గోదావరి ఎక్స్‌ప్రెస్ సంగతి నాకు బాగా తెలుసును. మద్రాస్ హవురా జనతా ఒకటీ, తిరుపతి పూరీ ఎక్స్‌ప్రెస్ ఒకటీ ఉన్న రోజుల్లోనే కంచరపాలెం గేటు దగ్గిర ఆగుతూ వచ్చింది. ఆ రెండు రైళ్లు రద్దు చేసేసేరు గనక ఇప్పుడు ఇంకా తప్పనిసరిగా మా గేటు దగ్గిర ఆగి తీరుతుంది. లేకపోతే గొప్ప ఘోరం జరిగిపోతుంది; అదెవరో వెనకటికి జోకు వేసినట్టు."

"జోకేమిటీ; చెప్పండి, చెప్పండి!" అని ఇంతసేపూ మా సంభాషణ వింటున్న సహ ప్రయాణికుడొకాయన అడిగాడు.

"అది మన విశాఖపట్నం స్టేషన్ గురించి కాదులెండి," అన్నాను.

"కాకపోయినా సరే, జోక్ అన్నారు గనక చెప్పవలసిందే."

"ఏం లేదు, వెనకటికి ఒకాయన మద్రాసు వెళ్లే మెయిల్లో ప్రయాణం చేస్తూ; తను కూర్చున్నది బెంగుళూరు బోగీ కదా అని కొంచెం బెంగగా అడిగేడట; ఈ రైలు మద్రాసులో ఆగుతుందా అని. దానికి ఆ పక్కనున్న ఆయన సీరియస్‌గా మొహం పెట్టి ఈ రైలు మద్రాసు ప్లాట్‌ఫారం మీద ఆగకపోతే పెద్ద యాక్సిడెంటు అయిపోతుంది - అని చెప్పేడట."

"ఏక్సిడెంట్ ఎందుకైపోతుంది?"

"అది మద్రాసు ప్లాట్‌ఫారాల నిర్మాణంలో ఉన్న విచిత్రం. ఆ ప్లాట్‌ఫారాలన్నీ అరచేతిని అనుసరించి ఉండే వేళ్లలాగ ఉంటాయి. లైన్లన్నీ అక్కడికొచ్చి ఆగిపోతాయి. అక్కణ్ణించి ఏ ఊరికి వెళ్లాలన్నా సరాసరి వెళ్లదు. రైలు వెనక్కొచ్చి వెళ్లవలసిందే. అంచేత రైలు ఆగకపోతే

స్టేషన్‌లోనికి దూసుకువెళ్ళి పోతుందన్నమాట. అది ఏక్సిడెంటే కదా.''

"మరి కంచరపాలెం గేటు దగ్గిర గోదావరి ఎక్స్‌ప్రెస్ ఆగకపోతే ఏదో ఘోరం జరిగి పోతుందన్నారు, అదేమిటి?''

"అదేంటండీ అలాగ అడుగుతారు? గోదావరీ ఎక్స్‌ప్రెస్ కంచరపాలెం గేటు దగ్గిర ఆగకపోతే ఈ కూరగాయల తట్టలూ, పాలకేన్లు, పళ్లగెలలు ఇవన్నీ కంచరపాలెం మెట్టు దగ్గిర మార్కెట్‌కి అందవు. ఈ ప్రాంతాల వాళ్లు అంటే కంచరపాలెం, రామ్మూర్తి పంతులు పేట, రైల్వే క్వార్టర్సు, పోర్టు క్వార్టర్సు, మర్రిపాలెం, తాటిచెట్లపాలెం జనం అంతా కూరగాయలూ, పళ్లూ, పాలు అందక ఎంత అవస్త పడాలి? ఈ లక్షన్నర జనాభా మళ్లీ వాటికోసం పూర్ణా మార్కెట్టు దాకా వెళ్లవలసిందే కదా. ఇది ఘోరం కాదంటారా?'' అన్నాను.

"అయితే ఇవాళ ఏదో ఘోరం జరగమనే ఉంది. ఎందుకంటే మన రైలు గేటు దగ్గర ఆపలేదు. మీ మాటల్లో పడి మీరు గమనించలేదు. గబగబా సామాన్లు సర్దుకోండి. స్టేషన్ దగ్గిర పడుతోంది'' అన్నారు మా ఆఫీసర్ చిరునవ్వుతో.

ఆశ్చర్యం!

ఎవరైనా గమనించేరో లేదో గాని "గోదావరి ఎక్స్‌ప్రెస్'' అని పేరు పెట్టినందుకు కతజ్ఞతగా ఈ రైలు ఉభయగోదావరి జిల్లాల్లో కలిపి మొత్తం తొమ్మిది చోట్ల ఆగుతుంది. అలాంటిది గోదావరి ఎక్స్‌ప్రెస్; పిఠాపురం, అన్నవరం, యలమంచిలి లాంటి అల్కాచిల్కా చోట్ల ఆగి కూడా కంచరపాలెం మెట్టు గేటు అనబడే రామ్మూర్తిపంతులు పేట గేటు దగ్గిర ఆగలేదు!

వెయ్యిమంది తట్టలవాళ్లు, వందలమంది పాలకేన్లవాళ్లు, మరో వందమంది అరటిపళ్ల గెలల వాళ్లు, వెయ్యిమంది కూరల గంపల వాళ్లు, వందల మందిలో ఏ ఒక్కరూ కూడా గొలుసు లాగలేదన్న మాట!

ఈ గోదావరి ఎక్స్‌ప్రెస్‌ని నేను (ఆవిడగారు) పుట్టినప్పటిన్నుంచి ఎరుగుదును. మొదట్లో ఏ కొద్ది రోజులో ఎక్స్‌ప్రెస్ అనిపించుకుంది. రాను రాను ఆగవలసిన స్టేషన్లు ఎక్కువయ్యేయి; గేట్లు కూడా ఎక్కువయ్యేయి. కంచరపాలెం గేటు లక్షన్నర మందికి సంబంధించింది; అది వదిలెయ్యండి, కశింకోట కాలేజీ గేటు దగ్గిర మహా అయితే వందమంది స్టూడెంట్స్ దిగుతారు. అక్కడకూడా ఆగుతుంది పాపం. స్టీల్ ప్లాంట్ నిర్మాణం పూర్తయితే దువ్వాడ దగ్గిర అరగంటసేపు ఆగడం ఖాయం. అటువంటిది ఇవాళ ఇలా ఎందుకు జరిగిందో అని బెంగపెట్టేసుకున్నాను.

స్టేషన్‌లో బండి ఆగగానే మా ఆఫీసు అటెండరు కనిపించేడు. "సార్, జీపు వస్తుందండి. తొందరపడి ఆటోలు కట్టించేసుకోకండి, అసలే మనూర్లో ఆటోలకి మీటర్లుండవు!'' అన్నాడు. సామాన్లు ఒక్కొక్కటీ అందుకొంటూ ముగ్గురం కలసి సామాన్లు టిక్కెట్టిచ్చేసే గేటు దాకా లాక్కొచ్చేం.

గేటుకి ఎదురుగా సెకండుక్లాసు బోగీ ఒకటి ఆగి ఉంది. అక్కడ సుమారు వందమందికి పైగా జనం పోగుబడి ఉన్నారు.

"జీపు వచ్చేదాకా ఏం చెయ్యాలి? పదండి ఆ గొడవ ఏమిటో చూద్దాం,'' అని మా ఆఫీసర్

గారు లాక్కెళ్లారు.

జనాన్ని మోచేత్తో తోసుకుని లోపలికి జొరబడ్డాం.

అక్కడ ఒకాయన స్పృహతప్పి పడిపోయి ఉన్నాడు. యాభై ఏళ్లు దాటిన మనిషి. గుండులా ఉన్నాడు. చొక్కా ఫ్యాంటులో టకప్ చేసుకున్నాడు. కాళ్లకి బూట్లు, మెడలో నెక్ టై. ఎవరో అధికారి లాగ కళ్లకి ఆనేడు.

"అరె, ఈయన చారుదత్తబోసు గారు!" అన్నారు మా ఆఫీసర్.

"అంటే?" అన్నాను; ఎందరో మహానుభావుల పేర్లు నాకు తెలియవని ఒప్పేసుకోడానికి ఏ మాత్రం సిగ్గుపడకుండాను.

"ఈ రైల్వేకి జనరల్ మేనేజరండీ, ఈయన!"

ఇంతలో ఒకావిడ గ్లాసులో చల్లటి నీళ్లు తెచ్చి అతని మొహం మీద చిలకరించడం మొదలెట్టింది. అరనిమిషంలో లేచాడు అతను.

"అదేంటి అల్లుడుగారూ, అలా పడిపోయేరు? నేను రావడం మరీ అంత అకస్మాత్తుగా రాలేదే! వారం రోజుల కిందట ఈ రోజు ఈ ట్రెయిన్‌లో వస్తున్నానని ఉత్తరం రాశాను. నిన్న మధ్యాహ్నం ఫోన్ చేసేను!" అందావిడ.

అతను లేచి నిలబడ్డాడు. "అయామ్ సారీ, అత్తగారూ!" అన్నాడు. "అంత రూఢిగా మీరు కబురు అందించినందువల్లనే మిమ్మల్ని స్వయంగా రిసీవ్ చేసుకుందామని స్టేషన్ కొచ్చాను. రైలు ఎనిమిది గంటల యాభై నిమిషాలకి చేరాలి. రైట్ టైం అన్నారు. సికింద్రాబాద్ స్టేషన్‌కి కాంటాక్ట్ చేసి మీ పేరు చెప్పి మీరు ఏ కంపార్టుమెంట్‌లో ఉంటారో కనుక్కుంటే, యస్ - టూ అని తెలిసింది. నాకిక్కడ సంగతి బాగా తెలీదు కదా. రెండో బోగీ అయితే ఆ చివర వొస్తుందనుకుని అక్కడ మీకోసం నిలబడ్డాను. తీరా బండి ఆగే వేళకి "ఎస్ టూ" బోగీ ఈ కొసని ఆగుతుందని తెలిసింది. అక్కణ్ణించి ఇక్కడికి రావడానికి తొందరగా నడుస్తూ వొస్తూ; అబ్బో, ఎన్నిసార్లు పడిపోయానో. ఈ దిక్కుమాలిన ప్లాట్‌ఫారం నిండా ఇన్ని వందల తట్టలేమిటి! అడుగు పెడితే తట్ట, అడుగు తీస్తే గంప. అవన్నీ తన్నుకుని పడుతూ లేస్తూ చివరికి ఇక్కడ మీరు కనబడగానే అరటిపండు తొక్కమీద కాలు వేసేను, అంతే."

పక్కనే ఇంకో చిన్న అధికారి వివరించేడు! "అక్కడికినీ, అమ్మగారు! నేను చెప్తూనే ఉన్నానండీ. రైలు రైట్ టైమ్‌కే వస్తుంది గానీ కంచరపాలెం గేటు దగ్గిర జస్ట్ ఐదు నిమిషాలు ఆగుతుంది గనుక తొమ్మిది గంటల్లోగా రైలిక్కడ చేరుతుందని! అయ్యగారేమో 'నాన్సెన్స్! గేటు దగ్గిర బస్సులూ, కార్లూ, సైకిళ్లూ ఆగాలి గాని రైళ్లు ఆగిపోతే ఎలాగ?' అని సిగ్నల్ డిపార్టుమెంట్ వాళ్లని అదరగొట్టేసి అక్కడ బండి ఆగకుండా చేసేసేరండి. ఈ తట్టల వాళ్లు అక్కడ దిగిపోయి ఉంటే అయ్యగారు ఇన్నిసార్లు పడిపోకుండా ఉండేవారు."

"సర్లే. రేపట్నుంచి మామూలుగా కంచరపాలెం గేటు దగ్గిర రైలు ఆపుకునే రమ్మనండి, బుద్ధొచ్చింది" అని ఆ జనరల్ మేనేజర్ గారు అత్తగారి ఎదురుగా, అశేష జనం సమక్షంలో లెంపలు వాయించుకున్నారు. ★